
# సంస్కృతి



ఆకాశంనించి ఒకొక్క చినుకూ రాలుతూఉంటే కిటికీ ఊచల మధ్య నించి చూడ్డానికి బాగానే ఉంటుంది. ఆ బాగు ఎంతసేపు!? అయిదు నిమిషాలు లేదా, పదినిమిషాలు. ఆ తరవాత!? ఆ తరవాత మరేముంది!' మహా విసుగు.

అదేమాదిరిగా అందమైన కలలు కొంతకాలంపాటు అందంగానే కనిపిస్తాయి. బ్రతుకు మహామధురమైంది అనిపిస్తుంది. రానురాను ఆ అందమైన కలలే పంచతిక్త కషాయం మాదిరి మహా చేదనిపిస్తాయి.

పల్లెటూరి గురించి బ్రహ్మానందం ఎన్నెన్నోకలలు కన్నాడు. దాదాపు పది సంవత్సరాలపాటు మహానగరంలో బతికినందువల్ల నగరంలో బతకడంలో రుచి పోయినట్టనిపించింది. మొట్టమొదట్లో రుచి కనిపించినా, క్రమంగా విసిగెత్తిపోయింది. పట్టణ జీవితం విసుగు కలిగించడం ప్రారంభించి నప్పటినించి పల్లెటూరి బతుకుమీదికి దృష్టిపోయిందతనికి. పల్లెటూళ్ళో కావలసినంత గాలి, వెలుగు, చిక్కటిపాలు, జున్నుముక్కలాంటి పెరుగు, చూపానినంత మేర పచ్చదనం, గాలికి అలా అలా ఊగే పంటచేలు ఇవన్నీ కలల్లో కన్పించి బ్రహ్మానందాన్ని ఊరించడం ప్రారంభించాయి.

'మాయదారి పల్లెటూరులే! అక్కడేం దొరుకుతాయని అంత సంబరపడి పోతున్నారు? మనసు పుట్టినప్పుడు చూడ్డానికి మంచి సినిమా అయినా దొరకదు' అని మహాలక్ష్మి అన్నప్పుడు మనిషి మంచి సినిమా చూడ్డానికే కాబోలు పుట్టాడనుకుని బ్రహ్మానందం చిరునవ్వు నవ్వేవాడు.

'వోసి పిచ్చిదానా! మా ఊళ్లో సినిమాయే లేదనుకున్నావా? వో టెంపరరీ షెడ్డుందిగా! అదేచాలు. నెలకో మంచి సినిమాచూస్తే సరిపోదా ఏమిటి!' అనేవాడతను.

మహాలక్ష్మి యించక్కా మూతి తిప్పుకునేది.

'గట్టిగా వర్షంకురిస్తే రేకుల శబ్దం చాలు ఆ సినిమాహాల్లో మరి సినిమా చూడ్డం కూడానా! ఆ సినిమాలైనా నే పుట్టినప్పటివి ఆడుతూ ఉంటారు. బాలరాజనీ కీలుగుర్రమనీ పాతడొక్కులు ఎన్నిసార్లని చూస్తాం!!' అని గునిశేదావిడ!

సరిగ్గా యిదే సమయంలో బ్రహ్మానందం వో నగ్నసత్యం చెప్పేవాడు.

'పాత సినిమాలని ఎప్పుడూ ద్వేషించకూడదోయ్! ఆ మాటకొస్తే పాత సినిమాలంత మంచివి ఇవాళ మనవాళ్లు తీయలేక పోతున్నారు. అప్పటి సినిమాలన్నీ సంసారపక్షంగా కుటుంబం యావత్తూ ఒకే బెంచీమీద కూచుని చూసేటట్టుగా నీతి బోధకంగా తీసేవారు. ఇప్పటిసినిమాలంటావా—వాటి సంగతి నాకంటె నీకే బాగా తెలుసు...'

అక్కడితో ఆ సంభాషణ ఆగిపోయేది.

# సంతృప్తి

బ్రహ్మానందం పల్లెటూరి గురించి సంవత్సరాల పర్యంతం అందమైన కలలు కన్నాడు. పల్లెటూళ్లో తనెలా జీవితం ప్రారంభించ దలచుకున్నాడో, అక్కడకూ యిక్కడకూ జీవితం ఏవిధంగా మారిపోతుందో రకరకాలుగా ఊహించుకుంటూ ఉండేవాడు.

నగరంలో ఫేన్‌కింద కూచుని, రేడియో వింటూ పల్లెటూరి అందాన్ని గురించి ఆలోచించుకోవడమైతే అందంగానే ఉంటుంది గాని, తీరా పల్లెటూరికివొచ్చి జీవితం ప్రారంభించేసరికి ఆ అనుభవం వేరే అనుభూతుల్ని ప్రసాదించవచ్చు.

బ్రహ్మానందం అందమైన కలల గురించి సవివరంగా చెప్పడంకన్న ఆ కలల నిజస్వరూపాన్ని అతగాడేవిధంగా దర్శించాడో చెప్పడంలోనే నిజమైన స్వారస్యం ఉంది.

బ్రహ్మానందం పుట్టడం ఒక చిన్న పట్టణంలోని ఆసుపత్రిలోనే పుట్టాడు గాని అతనిది మాత్రం తూర్పుగోదావరిలో ఒక పల్లెటూరు. పాపం! అతనికి ఆ పల్లెటూరిమీద చెప్పలేనంత అభిమానం. అయినా ఎక్కువకాలం అతనక్కడ గడపలేదు. ఏ చిన్నపట్టణంలో అతను పుట్టాడో అక్కడే అతను పదహారేళ్లు చదువు సాగించాడు. ఆతరవాత రెండేళ్లపాటు టైప్పూ షార్టుహేండూ నేర్చుకున్నాడు. అంతలో ఆంధ్ర రాజధాని నగరంలో ఉద్యోగం వచ్చింది. ఆతరవాత ఒక ఉద్యోగి కూతురుతో వివాహమైంది. పదేళ్లపాటు హాయిగా సంసారం సాగింది. ముగ్గురు పిల్లలు పుట్టారు.

బ్రహ్మానందం తండ్రిగారు అకస్మాత్తుగా కాలధర్మం చేయడంతో ఒక్కగానొక్క కొడుకు ఇంటిదగ్గర వ్యవహారాలు సరి చూడడానికి విధిగా ఉద్యోగాన్ని వొదులుకోవలసిన అవసరం ఏర్పడింది.

ఒకరోజు సరిగా చీకటి పడుతున్నవేళ బ్రహ్మానందం యింట్లో అడుగుపెట్టిన సమయానికి బ్రహ్మానందంగారి పెద్దబ్బాయీ, ఆ అబ్బాయి తల్లీ తమ పల్లెటూరి ప్రయాణం గురించి చర్చించుకుంటున్నారు. బ్రహ్మానందం రావడం వాళ్లిద్దరూ అతిస్పష్టంగా చూచినా, అతని రాక వాళ్ల చర్చకు ఏవిధంగానూ అడ్డు రాలేదు.

'నువ్వెన్ని చెప్పినాసరే — ఈ వెధవ హైదరాబాదుకంటె మసూరే మంచిది' అన్నాడు పెద్దబ్బాయి.

'అవునాయనా! ఆ అబ్బ కొడుక్కాడూ ఈ పిడుగు. గంటనించి మొత్తుకుంటున్నాను—మీ నాన్నకి నచ్చచెప్పరా— అని. అంతా విని చివరికి నువ్వు కూడా అమాటే అంటున్నావన్నమాట.'

'కాకపోతే — నాన్నగారికొచ్చే జీతానికి మనం పల్లెటూళ్లో ఉంటేనే బావుంటుంది.'

బ్రహ్మానందం అసలు వాళ్ల సంభాషణలో కలగజేసుకోకూడదనుకున్నాడు. కాని తన జీతం ప్రసక్తి వొచ్చేసరికి అతనికి చాలా పౌరుషం వొచ్చింది. ఎనిమిదేళ్లవాడు కొడుకు. ఎనభైయేళ్ల వాడిమాదిరి మాట్లాడుతున్నాడు. వాడుచెప్పినదాంట్లో అబద్ధం లేదు. అయినా తన జీతం తక్కువనీ, తన కొస్తున్న ఈపాటి జీతం రాళ్లతో తామిక్కడ బతకడం చాలా కష్టమనీ తనముందే చెప్పడం అతనికి బాధనిపించింది. రెండువందరూపాయల జీతం అంటే వీళ్లకు చాలా నీచంగా అనిపిస్తోందన్నమాట! అంతకన్న తక్కువ జీతం తెచ్చుకుంటుకున్న వాళ్లు ఈ మహానగరంలోనే బిడ్డాపాపాతో చాలా సుఖంగానే బతగ్గలుగుతున్నారు.




తనకన్న తక్కువ జీతం వొస్తున్నదని బ్రహ్మానందానికెప్పుడూ అసంతృప్తి లేకపోయినా, తనభార్యకు మాత్రం ఆ అసంతృప్తి ఉందని అతనెరుగును. కాని ఆమె అసంతృప్తిని పోగొట్టడానికి తనేమీ చేయగల స్థితిలో లేడు. పెళ్లయిన కొత్తలో భార్యకు అసంతృప్తి కలక్కుండా అతనెన్నోవిధాల జాగ్రత్తపడ్డాడు. భార్య అడక్కుండానే చీరలు తెచ్చేవాడు. స్నోలూ పౌడర్లూ తెచ్చేవాడు. కొత్త మోజులో అతను భార్య సరదాలకు అప్పులు కూడా చేశాడు. కాలక్రమేణా ఆ అప్పులు తీర్చడానికి అతనెంత కష్టపడిందీ యిప్పటికీ అతనికి జ్ఞాపకం ఉంది: అతను మరీ గర్భదరిద్రుడు కాకపోయినా కొంచెం మెతకమనిషి కావడాన డబ్బుకోసం ఇంటికి రాయడానికి వెనకముందు లాడేవాడు.

మహాలక్ష్మి పుట్టింటినుంచి ఏం తెచ్చుకోకపోయినా ఆడంబరాన్ని తెచ్చుకుంది. ఇంటికెవరొచ్చినా, వాస్తవాలు తనను గురించిన గొప్పలు చెప్పుకోడానికి ఎన్ని గంటలైనా సరిపోవు.

'మా ఆయన అలా ఉన్నారనిగాని, ఎంతమంచివారో మీకు తెలీదు. ఆయన్ను చూస్తే అయిదొందలు జీతమని ఎవ్వరూ అనుకోరు.' అంటూ ప్రారంభించేది మహాలక్ష్మి. బ్రహ్మానందం జీతం సంగతి అవతలివాళ్లకీ బాగా తెలిసినా, మహాలక్ష్మి సంతృప్తికోసం తప్పనిసరిగా నమ్మవలసి వచ్చేది.

'నాకు రెండొందలు జీతమని సిగ్గుపడక్కర్లేదు. ఊరికెళ్లిపోతే లక్షలు సంపాదిస్తాను. రాయిగుమేడలు కట్టిస్తాను. ఒక్క రెండు సంవత్సరాలు పోయాక వందెకరాలు కొంటాను. ఇక్కడ అనాశాక్తంగాని ఉంటేనా — నిజాం నవాబు అంతని కోసందర పోదునా!' అని అరిచాడు బ్రహ్మానందం గదిలోంచి.

'అయ్యో పాపం!' అని గొణిగింది మహాలక్ష్మి.

అంతలో తల్లీ కొడుకుల చర్చ ఆగిపోయింది. కొడుకు వీధిలోకి వెళ్లిన తరవాత మహాలక్ష్మి ఫ్లాస్కులో కాఫీ గ్లాసులోకి వొంపి, భర్త కందించింది. అయిష్టంగా అందుకుని బ్రహ్మానందం దాన్ని గుటుక్కుమనిపించాడు.

'ఇంటి దగ్గర్నుంచేమైనా ఉత్తరం వొచ్చిందా ?' అనడిగాడు బ్రహ్మానందం గ్లాసు కిందపెడుతూ.

మహాలక్ష్మి తల అడ్డంగా తిప్పింది. ఆ వరస చూసి బ్రహ్మానందానికి మళ్ళీ కోపం వొచ్చింది.

'వొచ్చిందనో రాలేదనో నోటితో చెప్పకూడదా ! తీసరం కాకపోతే !' అని అందామనుకున్నాడు. నాలిక చివరివరకూ వొచ్చిందిగాని మరునాటి ఉదయంవరకూ ఆ విషయం మీదే పెద్ద రాద్ధాంత మవుతుందని భయపడి, బ్రహ్మానందం నోరు మూసుకుని, పళ్ళు కొరుక్కున్నాడు.

'ఇంటిదగ్గర పరిస్థితులు ఎలా ఉన్నాయో ! ఇంటికెళ్ళి వచ్చినప్పటి నుంచి మనసంతా అక్కడేఉంది' అని మాత్రం అన్నాడు.

మహాలక్ష్మి ఖాళీగ్లాసు తీసుకువెళ్ళిపోయింది. తల వెనక్కువాల్చి, బ్రహ్మానందం పల్లెటూరి ఆలోచనల్లోకి జారిపోయాడు.

మరునాటి సాయంకాలం మాత్రం బ్రహ్మానందానికి ఊరినించి ఉత్తరం వచ్చింది. నిజానికి బ్రహ్మానందం అటువంటి ఉత్తరాన్నెప్పుడూ ఆశించలేదు, తనకి రావలసిన ఉత్తరం రాకపోగా, ఇటువంటి అనవసరపు ఉత్తరం వొచ్చినందుకు బ్రహ్మానందానికి చాలా కోపం వొచ్చింది.

ఉత్తరం మొదటిసారి చదివి బ్రహ్మానందం పిల్లలమీద కోప్పడ్డాడు. ముగ్గురు కొడుకులుండీ, తనకి సుఖంలేదనీ, యింటి యజమానై ఉండికూడా పాలేరుగా ఉంటున్నానని చాలాసేపు సణుక్కున్నాడతను. ఈలోగా మహాలక్ష్మి ఇంట్లో బొగ్గులైపోయాయని హెచ్చరిక చేసింది.

'మూసీలో మునగండి ! ఎప్పుడూ లేదులేదనే తప్ప మరోగోలలేదు. వొచ్చే జీతం అంతా పదిరోజులకే ఆర్పేస్తారు. నేనెక్కడినించి తేను ? తెచ్చింది తింటూనే నాకు జీతం తక్కువని నన్నే వేళాకోళం చేస్తున్నారు. ఇవేళ్టినుంచి నేనేం తీసుకురాను. ఎట్లా బతుకుతారో చూస్తాను...' అంటూ మరోగంట సణిగాడతను. అప్పటికి మహాలక్ష్మి పక్కింటివాళ్ళనడిగి కొన్ని బొగ్గులుతెచ్చి, వంట చేసేసింది.

# సంతృప్తి

'ఏదీ — ఆ బొగ్గులనంటి యిటు పడేయ్ ?' అని అరిచాడు బ్రహ్మానందం.

'రేపొద్దుట తెచ్చుకోవొచ్చులెండి ! ఈ పూటకి సరిపడా పక్కింటి వాళ్ళనడిగి తెచ్చాను' అని చెప్పింది మహాలక్ష్మి.

దాంతో బ్రహ్మానందానికి కోపం తారస్థాయి నందుకుంది. 'బొగ్గులుకూడా బదులుచేసి నా పరువుతీసేస్తున్నావు. బజారుకెళ్ళి తెచ్చేవాడినిగా ! వెళ్ళు—ఆ బొగ్గులిచ్చేసిరా !' అని చిందులు తొక్కాడు.

మహాలక్ష్మికేం సమాధానం చెప్పాలో తెలియలేదు. వెళ్ళి వోమూలను కూచుంది.

బ్రహ్మానందం మళ్ళీ వోసారి ఉత్తరం చదువుకున్నాడు.

పల్లెటూరి స్నేహితు డొకాయన రాసిన ఉత్తరం అది. బ్రహ్మానందం ఉద్యోగం మానేసి పల్లెటూరికి రావడానికి నిర్ణయించుకున్నట్లుగా తెలిసి అతగాడు వో చిన్నసలహా యిచ్చాడు. ఈ రోజుల్లో ఉద్యోగం వదిలివేయడమంత బుద్ధితక్కువతనం మరోటి లేదనీ, పల్లెటూళ్ళు ఇదివరకట్లాగాక రాజకీయాలతో నిండిపోయి చాలా ఘోరంగా ఉన్నాయినీ, బాగా ఆలోచిస్తే ఉద్యోగానికి మించిందేం లేదనీ స్నేహితుడు సలహా యిచ్చాడు.

బ్రహ్మానందం నాలుగోసారి ఉత్తరం చదువుకున్నాడు. అతనికి ఒళ్ళు కుతకుతలాడిపోయింది. వ్రదున ఉత్తరం చింపేశాడు. లేచి నిలబడి, గదిలో ఆమూలనుంచి ఈమూలకు, ఈమూలనుంచి ఆమూలకు పచార్లు ప్రారంభించాడు.

పరిచయం ఉన్నవాళ్ళు పరిచయస్థులుగా మాత్రమే ఉండక, ఎదుటివాళ్ళ బాగుకోరినట్టు ఉచిత సలహాలిస్తూ ఉంటారు, ఆ సలహాలవల్లనే ఒక్కోసారి ఎదుటివాళ్ళు కష్టపెట్టుకోవలసి వస్తుంది.

పదిరోజులు గడిచిపోయాయి. బ్రహ్మానందం మామూలుగా ఆఫీసుకు వొస్తూ పోతూ ఉన్నాడేగాని అతనికి మతిస్థిమితం లేకుండా పోయింది. ఓ పది లంఘణాలుచేసి పత్యం పుచ్చుకున్నంత బలహీనంగా తయారయ్యాడు మనిషి. అతని దృష్టంతా పల్లెటూరి వ్యవహారాలమీదనే పడిపోయింది. భార్య సలహామీదట వో పది రోజులు సెలవుపెట్టి అతనొక్కడూ ఊరికి బయలుదేరాడు.

అతి ప్రయాసమీదట రాత్రంతా జాగరణ చేసి మధ్యాహ్నం పన్నెండుగంటలకు బ్రహ్మానందం తన ఊరికి జేరుకున్నాడు. తను యింటికి జేరుకోడం అతనికి బ్రహ్మానందంగానే ఉందిగాని— ఎటొచ్చీ సంతోషించనిదల్లా అతనింటిలో జనమే. తల్లి అతని రాకకు వివిధమైన భావాన్ని వ్యక్తం చేయలేదు. విధవ మేనత్త మాత్రం వెకిలి నవ్వొకటి నవ్వి, 'చెప్పి పెట్టకుండా వొచ్చావేం నాయనా ! తల్లిమీద మనసు తిరిగినట్టుంది' అని పరామర్శించింది. ఇంటిదగ్గర పరిస్థితి చూసీ చూడగానే బ్రహ్మానందానికి ఒంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకినట్టుగా ఉంది. అంకంత కొంపలో చూదామంటే ఎక్కడా ఖాళీయే ఉన్నట్టుగా కనిపించడంలేదు. వో గదిలో ధాన్యం బస్తాలున్నాయి. ఆ గదికి పక్కవసారాలో కందులు, ఉలవలు, నువ్వులు, మిరపకాయలు బస్తాల్లో పడి ఉన్నాయి. ఇటువక్క వసారాలో ఆవకాయ జాడీలు రెండు, విరిగిపోయిన నాలుగు కుర్చీలు, వో మూలగా మరపట్టించిన బియ్యం మూటలు నాలుగూ ఉన్నాయి. ఒక వసారాలో వంటసామాను, కూరగాయల బీరువా, కుండలూ—మండలూ ఉన్నాయి. ఇంకోవసారా వంటకుపయోగించుకుంటున్నారు. అటకమీద కొబ్బరికాయలు. ఎటొచ్చీ ఖాళీగా కన్పిస్తున్నదల్లా ఒకే ఒక గది. దొడ్లో పందిరిమీద అనపపాదు, చిక్కుడుపాదు తీగలేస్తున్నాయి. అటుపక్క గోడమూల పాకలో రెండుగేదెలు, ఒకదున్నపిల్ల పడుకుని నెమరేస్తున్నాయి. పాక కిటువైపు ఈగలు ముసిరిన తాటికాయలు, టెంకలు చిందవందరగా పడి ఉన్నాయి. పక్కనే కోళ్ళ గూడుంది. అటుపక్క పెద్ద కమ్మలరాశి.

బ్రహ్మానందానికి కడుపులోంచి బాధ పుట్టుకొచ్చింది. ఒక గది, కిచెన్‌తో చలా శుభ్రంగా, ప్రతివస్తువూ ఇంపక్కా అమర్చుకుని బతకడానికి అలవాటుపడిపోయిన తనకు బూజులు వేలాడుతూ, అందవిహీనత దిగజారుతూ, ఎక్కడి

వస్తువులక్కడ నిద్రపోతున్నట్టుగా పడి ఉండడం చూసి రోత పుట్టుకొచ్చింది, పల్లెటూరి అందమంతా యింతేనా అనిపించిందతనికి.

అతనికి భోజనం మాత్రం బాగానే కుదిరింది. గుత్తివంకాయ, కమ్మని నెయ్యి, అరటికాయవేపుడు, ఆవకాయ, అనపకాయ పులుసు, గడ్డపెరుగు... మరింకేం కావాలి—సుష్టుగా భోంచేసి పడుకున్నాడు. నిద్రమెలకువ వచ్చేసరికి కన్ను పొడుచుకున్నా కనిపించనంతటి చీకటి గదినిండా నిండి ఉంది. చటుక్కున వాచీ చూసుకుంటే, గడియారంలో గంట నాలుగే కనిపించింది. ఆకాశం నిండా కారుమేఘాలు కమ్ముకున్నాయి. మరో అయిదునిమిషాలకు హోరున కురవడం ప్రారంభించింది. ఆ కురవడం కురవడం రాత్రంతా కురుస్తూనే ఉంది. దానికితోడు విపరీతమైన గాలి. ఆరాత్రి బ్రహ్మానందానికి ఎంతకూ నిద్ర పట్టిందిగాదు. గదికి బూజులు మీద పడసాగాయి. ఏవేవిటో పిచ్చిపిచ్చి ఆలోచనలతో అతి కష్టంగా తెల్లవారింది. ఎప్పుడని ఎండొస్తే బావుణ్ణనుకున్నాడు బ్రహ్మానందం. వర్షం తగ్గితేనా! మరింత హోరున కురుస్తూనే ఉంది.

బంగాళాఖాతంలో పుట్టిన ముడిగుండం అక్కడెక్కడో తీరాన్ని దాటుతూనో, తీరం వెంట పరుగెత్తుతూనో ఉంది కాబోలు వానకురుస్తూనే వుంది, గాలి వీస్తూనే ఉంది.

రెండురోజులు గడిచిపోయాయి.

వర్షం మాత్రం తగ్గుముఖం పట్టలేదు.

ఆ రెండురోజులూ బ్రహ్మానందానికి ముళ్ళమీద కూచున్నట్టుగా ఉంది.

కాలక్షేపానికి సాధనాలేమీ లేవు. పోనీ ఏదేనా సినిమా చూద్దామంటే, టూరింగ్ టెంట్ లైసెన్స్ అయిపోయి, మూతబడింది. మరో రెండునెలలకుగాని అది ప్రారంభం కాదు. బయటెక్కడకూ కదిలి వెళ్ళడానికి వీల్లేదు. అడుగు బయట పెట్టడానికి వీల్లేనంత బురద బురద.

కిటికీ పక్కగా కుర్చీలో కూర్చున్నాడు బ్రహ్మానందం. హోరున కురుస్తున్న వర్షం ఉండుండీ ఆపోడం, మరో అయిదు నిమిషాల్లో చినుకూచినుకూ రాలడం—ఈ దృశ్యాలు కొద్ది కొద్ది మార్పులతో అతనికి విసిగెత్తించడం ప్రారంభించాయి. వేళకింత తినడం — పగలంతా కుర్చీలో కూలబడడం రాత్రికి నిద్రపోడం దినచర్యగా నాలుగురోజులు గడిచిపోయాయి.

ఒకరోజు మాత్రం తమ పొలాలు కౌలుకు తీసుకున్న పోతురాజు వచ్చి, పలకరించి వెళ్ళాడు. వాడు చుట్ట తిరగేసి కాల్చడం బ్రహ్మానందానికి సరదా అనిపించింది.

'ఉద్యోగం చేసుకునే మారాజులు మా ఊళ్లో ఉండలేరు బాబో! వర్షం వచ్చిందంటే మాపాట్లు ఏం చెప్పాలి! మీకైతే సిమెంటురోడ్లు, సిటీబస్సులూను. మాకేం వుంది! బురదా—మోకాల్లోతు నీళ్ళూను' అని వాడు చెబుతూంటే, బ్రహ్మానందానికి కోపం రాలేదు. నిజమేననిపించింది.

తనకు ఉత్తరం రాసిన స్నేహితుడి గురించి బ్రహ్మానందం వాకబు చేశాడు గాని అతగాడు ఊళ్లో లేడని తెలిసింది.

నాలుగోరోజు రాత్రి తల్లి తన అనుమానాన్ని బయట పెట్టింది.

'నువ్వు ఉద్యోగం మానేయడం నా కిష్టమేగాని—పట్టణాలలో అలవాటైపోయినవాళ్లు మీరిక్కడ ఉండలేరేమో అని నా అనుమానం.'

బ్రహ్మానందం అవుననిగాని కాదనిగాని ఏం చెప్పలేదు.


మరునాటి మధ్యాహ్నం వర్షం తగ్గుముఖం పట్టింది.,

బ్రహ్మానందం పడుతూ లేస్తూ ఊళ్ళోకి బయలుదేరాడు. ఊరికి చివరగా ఉన్న యింటినుంచి అమూలగా ఉన్న మునసబు గారింటికి నడిచి వెళ్ళడానికి అశ్వమేధయాగం చేసినంత శ్రమపడిపోయాడు బ్రహ్మానందం. తొడుక్కున్న పేంటు బురదనీటితో బరువెక్కింది. అక్కడికీ అతను పాపం! పైకి మడవనే మడిచాడు.

బ్రహ్మానందాన్ని చూస్తూనే మునసబుగారు కొండంత సంబరపడిపోయి—'రావోయ్ అల్లుడూ!' అని ఆహ్వానించారు.

తుంగచాపమీద మునసబుగారి సరసను కూచున్నాక, క్షేమసమాచారాల అనంతరం మునసబుగారు పల్లెటూరి బండారాన్ని చెప్పడం ప్రారంభించాడు.

'ఊళ్లో పరిస్థితులేమీ బాగుండ లేదోయ్ అల్లుడూ! కష్టపడి పనిచేసే వాడొక్కడూ లేడు. ఏదో మాయ చేసి రోజులు గడుపుదామనే ధ్యాస తప్ప ఉన్న భూమిని శ్రమపడి పండించుకుందామన్న మంచి బుద్ధిగల వాళ్లెవరూ కనిపించడం లేదు. రాజకీయాలు మాత్రం పెరిగిపోయాయి. వెంకటస్వామికీ రాఘవరెడ్డికీ



వాయిదాల పద్ధతిపై ట్రాన్సిస్టర్
కాయల్

(గ్యారంటీతో)
2 బ్యాండ్, ఆల్ వరల్డ్
పోర్టబుల్ ట్రాన్‌సిస్టర్.
ట్రాన్‌సిస్టర్, నెలకు రు. 5/– వంతున చెల్లించి పొందండి. ధర రు. 165. ప్రతి గ్రామము మరియు టౌనుకు పంపవచ్చును.
VIRLA AGENCIES (30)
Roop Nagar, Delhi—7.

పండిత డి. గోపాలాచార్యులవారి
అరుణ
స్త్రీల
ఆరోగ్య సౌభాగ్యానికి
1898 నుండి ప్రసిద్ధిగాంచినది.
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
100 జి.ఎన. రోడ్డు మదరాసు-17.

ఉచితం! ఉచితం!! ఉచితం!!!
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలైనా సరే వాని రంగు మరియు యొంత అసహ్యకరంగు, మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల సహజమైన రంగులోకి మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొఱకు 1 సీసామందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.
ROUND BHAWAN (DS)
P. O. KATRISARAI (GAYA)

మీకు ఆనందాన్నిచ్చే పుస్తకాలు
1 తెల్సుకోదగ్గవి:- మీ జీవితసుఖసంతోషాలకు మీరుతెలుసుకోదగ్గ అనేక వందల అద్భుత విషయాలు. రూ. 5-00
2. అద్భుత హాస్య కథలు:- మీరు నవ్వటానికి యితరులను బాగా నవ్వించటానికి కొన్ని వందల నవ్వించే కథలు. రూ. 3-50.
3. చేతిపనులు:- చిన్నపరిశ్రమలకు సర్కారు సంపాదనకు ఎన్నో రకాల సరుకులు, సులభంగా చేసుకొనే విధానాలు రూ. 3-50.
4. మంత్రశక్తి:- మీ కోర్కెలు నెరవేర్చుకోవటానికి వివిధ మంత్రాలు వాటి అద్భుత రహస్యాలు సాధనమార్గాలు. రూ 3-50.
5 జీవితరహస్యాలు:- మీదాంపత్య జీవితాన్ని సంపూర్ణ ఆనందమయం చేసుకోవటానికి అనేక దివ్యకామసూత్రాలు రూ. 3-50
6. యువతి:- స్త్రీలనుగురించి యువతీయువకులు తెలుసుకోదగిన అనేక అద్భుత కుతూహలవిషయాలు రూ. 3-50
7 సంతానము:- కామసుఖాలు అనుభవించుచు కూడ అవసరం లేనప్పుడు గర్భం రాకుండా 60 సులభమార్గాలు రూ. 3-50.
ప్రతి రచన వి. యస్. మూర్తి, యం.ఏ. పోస్టు ఖర్చు ఉచితం. దేశ సమస్త పుస్తకాలు, ఏలూరు-2, ఆంధ్రకు వ్రాస్తే మీ కోర్కె నెరవేరినవి వి.పి. పోస్టుద్వారా పంపబడును.

# సంతృప్తి

మధ్య వచ్చుగడ్డివేస్తే భగ్గుమంటోంది. ఊరంతా యిప్పుడు రెండు చీలికలైపోయింది. ఇది వినాశనానికే వొచ్చిందో, మంచికే వొచ్చిందో తెలియడంలేదు. అదలా ఉంచు, అప్పులేని వాడంటూ ఎవ్వడూ నా కంటికి కనిపించడం లేదు. కోఆపరేటివ్ బాంక్‌లో అప్పు. కోమటి కొట్లో అప్పు. ఎక్కడచూస్తే అక్కడ అప్పు. అక్షరాలా దరిద్రం నాట్యం చేస్తోందయ్యా మహానుభావా!...'

మునసబుగారి ఉపన్యాసం వింటూ వుంటే బ్రహ్మానందానికి తల తిరుగుతున్నట్టుగా అనిపించింది. తన ఊరి గురించి తాను ఎన్నెన్నో కలలు కన్నాడు. నగర జీవితంలోని కల్మషాన్నుంచి, చీకాకునుంచి తప్పించుకోవాలని ప్రయత్నించాడు. అతి ప్రశాంతంగా పల్లెటూళ్లో బతకవచ్చని అతను కలలు కన్నాడు. కన్నులపండుపుగా పచ్చటి జీవశక్తి, కడుపునిండుగా కమ్మటి గడ్డపెరుగు, మనసునిండుగా ప్రశాంతత అనుభవించవచ్చని అతను కట్టుకున్న ఆకాశ హార్మ్యాల అట్టడుగున డైనమైటు పేలుతుంది.

కులవర్గ విభేదాలు ఇదివరకటికన్న హెచ్చుపెరిగిపోయాయనీ, తక్కువ కులాల వారు ఆడంబరాలకోసం అగ్రవర్ణాలతో పోటీ పడుతున్నారుగాని కష్టపడి సంపాదించుకోడం మానివేశారనీ, కుట్రలకూ, మోసాలకూ పల్లె ప్రజలంతా అలవాటుపడిపోయారనీ విన్నప్పుడు బ్రహ్మానందానికి రాజకీయ నాయకులపైన కోపం వొచ్చింది. ఊకదంపుడు ఉపన్యాసాలతో సామాన్య ప్రజల బలహీనతలను రెచ్చగొట్టే దుర్బుద్ధులను అతను అసహ్యించుకొన్నాడు. రాజకీయాల వెనక కరుడుగట్టిన రాక్షస స్వభావాన్ని, విన్నప్పుడు అతను పల్లెసీమలు ఇదివరకటి మాదిరి రాజకీయ చైతన్యం లేకుండా ఉన్నా బాగుండిపోను అనుకున్నాడు.

ఆ రాత్రి బ్రహ్మానందం ఒక నిర్ణయానికి రాక తప్పలేదు.

మరునాటి ఉదయం అతనొక ఘోర [illegible] వార్త విన్నాడు: విప్లవవాదులమని చెప్పుకుంటున్న రాఘవరెడ్డి బృందం వారు తమ విరోధి అయిన వెంకటస్వామి యింటిని దోచుకొన్నారనీ, యింట్లో విలువైన వస్తువులన్నీ, ఒక్కటికూడా మిగల్చకుండా పట్టుకుపోవడమేకాక ఆడవాళ్లపై చేయి చేసుకున్నారనీ పోలురాజా వివరంగా చెబుతూంటే బ్రహ్మానందానికి చాలా బాధ అనిపించింది. అమాయకత్వానికీ, ధర్మ ప్రవర్తనకూ పేరుబడ్డ పల్లెటూరి ప్రజల రక్తనాళాల్లో విప్లవదృక్పథం ప్రవేశించింది. ఇది ప్రగతికి దోహదకారి కాగల మార్పు కాదు. ఈ మార్పు వినాశనానికే ప్రవేశించింది అనుకున్నాడు బ్రహ్మానందం.

పదిరోజులు శెలవుపెట్టి, ఆరవరోజునే తిరిగి వచ్చిన భర్తను చూచి, మహాలక్ష్మికి గొప్ప ఆశ్చర్యం కలిగింది.

'ఏమిటండీ! ఊళ్లో పరిస్థితులు ఎలా ఉన్నాయి?' అని అడిగిన భార్యను నఖశిఖపర్యంతం పరీక్షగా చూశాడు బ్రహ్మానందం. ఆ చూపు చూచి మహాలక్ష్మి భయపడింది.

ఆ రోజునుంచి బ్రహ్మానందం తనలో తాను సణగడం మానేశాడు. భార్యమీద బిడ్డలమీద కోపగించడం లేదు.

ఒకరోజు రాత్రి బ్రహ్మానందం భార్యతో అన్నాడు—

'మనిషికి సంతృప్తి అంటూ లేకపోతే బతకడం చాలా కష్టం. దూరపుకొండలు నునుపని పెద్దవాళ్లు చెప్పింది అబద్ధం కాదు. కలలు అందంగానే ఉంటాయిగాని అవి నిజంకావడం మామూలు మాట కాదు. ఆఫీసులో కూచుని నాలుగక్షరాలు రాసుకుంటే రోజు వెళ్లిపోయేదానికి ఎక్కడికో సముద్రపుటొడ్డుకు వెళ్లడం దేనికి?'

మహాలక్ష్మి నోరెత్తి మాట్లాడలేదుగాని మనసులో మాత్రం ఎంతో హర్షించింది. ●